# పచ్చళ్ళ అచ్చమాంబ

అచ్చమాంబ ఆ తల్లిదండ్రులకి ఆరో సంతానం! పైన పుట్టిన పిల్లలు పోవడం వలన అచ్చమాంబని చాలా గారంగా పెంచారు. అచ్చమాంబకి చిన్నప్పట్నుంచీ వంట చెయ్యడమంటే సరదా. తన మేధస్సు నుపయోగించి రకరకాల రుచికరమైన పచ్చళ్ళు తయారు చేసేది. ఆవిడ అత్తగారిది గుంటూరు. పెళ్ళి అయిన తర్వాత పచ్చళ్ళ విషయంలో పెచ్చుమీరింది అచ్చమాంబ! పచ్చళ్ళు పెట్టి పెట్టి 'పచ్చళ్ళ అచ్చమాంబ'గా ప్రసిద్ధి చెందింది. గుంటూర్లో బ్రాడీపేటకి వెళ్ళి "పచ్చళ్ళ అచ్చమాంబ" యిల్లెక్కడంటే చిన్న పిల్లాడు కూడా చూపిస్తాడు.

అచ్చమాంబ భోళామనిషి! ఆమె చేసిన పచ్చడి బాగుందంటే చాలు, యింట్లో వున్న పచ్చడంతా యిచ్చేస్తుంది.

చుట్టుప్రక్కల వాళ్ళు పచ్చళ్ళు చెయ్యడం తెలిసినా, "ఆ పచ్చడెలా, యీ పచ్చడెలా చెయ్యాలి" అని అమాయకత్వం నటించి, యీమె చేత చేయించుకు తినేవారు.

కొందరైతే "మా పెద్దమ్మాయి బాలింతరాలప్పుడు మీరు చింతకాయ పచ్చడిచ్చారు, తల్లీ పిల్లా కులాసాగా వున్నారు. మా రెండో అమ్మాయి ప్రసవించింది, మీ హస్తవాసి మంచిది. ఏమనుకోకుండా కొంచెం పాత చింతకాయ పచ్చడి యివ్వండి" అని తీసుకు పోయేవారు.

"అయ్యో అంత మొహమాటం ఎందుకు! తీసుకెళ్ళండి" అంటూ పాత చింతకాయ పచ్చడి పథ్యానికి, అల్లుడుగారు, పుట్టిన పిల్లని చూడ్డానికొస్తే యీ కొత్త చింతకాయ పచ్చడి వెయ్యండి! మొగాళ్ళకి పాతవి రుచించవు" అని విడివిడిగా యిచ్చేది.

ఒకసారి యిద్దరు మహిళలు వచ్చారు. అందులో ఒకామె అచ్చమాంబని పొగుడుతూ "అసలు యింత మంచి హస్తవాసి వున్నవార్ని ఎక్కడా చూడలేదు! అసలు మీరు లేడీ డాక్టరయితే మీ హస్తవాసి వలన చాలామంది ఆరోగ్యంగా వుండేవారు!" అంది.

"ఈవిడ డాక్టరయితే యీ పచ్చళ్ళు నువు పెడతావా!" అని మెల్లిగా ఆవిడతో

అంటూ, "ఆ ఏం డాక్టరవడం! సరియైన వైద్యం లేక ప్రాణాలు పోయినా ఫర్వాలేదు! పసందైన పచ్చడి తినకుండా బ్రతకడం కష్టం!" అంది రెండో మహిళ.

"బాగా చెప్పావు! ఏం పనిమీద వచ్చావు!" అని అడిగింది అచ్చమాంబ.

"ఏంలేదు! మధ్యాహ్నం మా చుట్టాలు వస్తున్నారు! ఇది వరకు గుంటూర్లోనే వుండేవారు! ప్రస్తుతం కాశీలో వున్నారు. వాళ్ళకి గోంగూర పచ్చడంటే చాలా యిష్టం! ఏమైనా ఓ సీసా గోంగూర పచ్చడి యిస్తారా!" అంది రెండో మహిళ.

"అయ్యో తీసుకెళ్ళు! మన 'గుంటూరు గోంగూర' ప్రసిద్ధి. పాపం వాళ్ళు జిహ్వ చచ్చి వుంటారు! యీ పచ్చడి తిని, ఎలా వుందన్నారో మాత్రం చెప్పు" అంటూ ఓ పెద్ద సీసా పచ్చడి యిచ్చింది.

వాళ్ళెళ్ళిన తర్వాత అచ్చమాంబ భర్తగా ప్రసిద్ధి చెందిన ఆనంద్ వచ్చి, "ఈ పచ్చళ్ళ మేళా ఏమిటే! సగం జీతం యీ పచ్చళ్ళకే ఖర్చయిపోతోంది!" అని బాధపడ్డాడు.

"మనమెవ్వరికి ఏం యిచ్చినా దాని గురించి ఆలోచించకపోతే, అది పది రెట్లయి మనకు వస్తుంది!"

"ఆ వస్తుంది! ఆ వచ్చిన పది రెట్లు పచ్చడి కూడా పచ్చని పందిరి వేసి, పదిమంది ముత్తైదులకి పంచుదువుగాని!" అన్నాడు ఆనంద్, విషాదంగా.

ఊళ్ళో ఎవరైనా ఒకరితో ఒకరు గొడవపడినప్పుడు, కొట్టానంటే "అచ్చమాంబ పచ్చడిలా" అయి పోతావు అనేవారు, ఒకసారి అచ్చమాంబ భర్త అని తెలీని ఒకడు అచ్చమాంబ పచ్చడిలా' అవుతావు అన్నాడు.

"ఇంట్లో ఎలాగూ పచ్చడవుతున్నాను, పచ్చళ్ళ ఖర్చు భరించలేక!" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు, అనంద్. రాను రాను ఆనంద్ పోరు భరించలేక, ఎవరు దినుసులు తెచ్చుకుంటే వారికి మాత్రమే పచ్చళ్ళు తయారుచేసి యిచ్చేది, అచ్చమాంబ.

అలా అలసి సొలసి ఒక నెల హాస్పిటల్లో చేరింది! ఈమె పోతే పచ్చళ్ళు పెట్టేవారుండరన్న దిగులుతో, రోజూ చాలా మంది హాస్పిటల్‌కి వచ్చి చూసి వెళ్ళే వారు. "ఫర్వాలేదు యిక ప్రాణం నిలబడ్డట్లే" అని డాక్టర్లు చెప్పిన తర్వాత, ఇక హాస్పిటల్‌కి ఎవరూ వెళ్ళలేదు!

హాస్పిటల్నుంచి యింటికి వచ్చిన తర్వాత, ఆనంద్, "ఇక ఆరోగ్యం క్షీణిస్తోంది! యీ పచ్చళ్ళ పని పెట్టుకోకు!" అన్నాడు.

"నేను మానేద్దామనే చూస్తున్నానండి! కాని పచ్చళ్ళ నోము ఒకటి పడదామని చూస్తున్నాను!"అంటూ, "పదహారు రకాల పచ్చళ్ళు, నూట పదహారు జాడీల్లో, నూట పదహారు మంది ముత్తైదువులకి యిస్తే, పచ్చళ్ళనోమయిపోతుంది! వచ్చే జన్మలో మనకి పచ్చళ్ళ లోటుండదు!" అని వివరించింది.

"ఇదేం నోమే! నేనెక్కడా విన్లేదే!"

"కొత్త కొత్త పచ్చళ్ళ తయారు చేసినట్లే కొత్తకొత్త నోములు కూడా చేసుకోవాలి!"

"ఇక యీ ఖర్చుతో నేను సన్యాసుల్లో కలిసిపోతాను, నీ యిష్టం మరి"

"ఆ భయం నాకు లేదు! మీలాంటి సన్నాసిని, సన్యాసులు వాళ్ళల్లో కలవనివ్వరు!"

"సరే! యిక నిద్రపో! అన్నింటికీ ఆ దేవుడే వున్నాడు!" అన్నాడు ఆనంద్.

"అవును దేవుడంటే జ్ఞాపకం వచ్చింది. మొన్నీ మధ్య ఓ కొత్త రకం పచ్చడి చేస్తూ, అది రుచిగా తయారయితే పాతిక కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నాను! బాగా జ్ఞాపకం చేసారు! రేపు ఆఫీసుకి వెళ్ళేటప్పుడు, ఓ మూడు వందలు యిచ్చి వెళ్ళండి! పచ్చళ్ళ విషయంలో మొక్కులు తీర్చుకోకపోతే, తర్వాత చేసే పచ్చళ్ళు నాశనమయిపోతాయి!"

ఇంతలో, ఎవరో తలుపు కొట్టారు. ఆనంద్ వెళ్ళి తలుపు తీసాడు, ఆనంద్‌ని పట్టి చవటకింద జమకట్టినట్లు "ఆంటీ కావాలి!" అన్నాడు ఆ వచ్చిన పిల్లాడు.

"ఎవరు బాబూ!" అంటూ అచ్చమాంబ బయటికి వచ్చింది.

"ఆంటీ! ఏలూర్లో వున్న మా పెద్ద అన్నయ్యకి తరచు జ్వరం వస్తోందట! ఇంతకుముందు మా రెండో అన్నయ్యకి జ్వరం వచ్చినప్పుడు మీరిచ్చిన 'నిమ్మకాయ' పచ్చడి పెడితే జ్వరం తగ్గి ఆరోగ్యం కుదుటపడిందట! ఓ సీసా నిమ్మకాయ పచ్చడి అడిగి తెమ్మన్నారు మా అమ్మగారు!" అన్నాడు.

"అయ్యో దానికేం బాబూ! యిరుగూ పొరుగూ సుఖంగా వుండడమే నాక్కావాలి. యిదుగో ఈ సీసా పట్టుకెళ్ళు!" అని ఓ పెద్ద సీసా వాడికిచ్చేసింది అచ్చమాంబ.

అర్థరాత్రి రెండు గంటలకి, అనంద్‌ని నిద్ర లేపి "ఏమండీ! మంచి కల వచ్చిందండీ!" అంటూ యిరుగు పొరుగువాళ్ళు తనని ఏనుగుని ఎక్కించి ఊరేగించి పెద్ద సన్మానం చేశారని, ఆ ఏనుగు తొండంతో ఓ పచ్చళ్ళ జాడీ పట్టుకుని ఊరేగిందనీ, 'పచ్చళ్ళ అచ్చమాంబకీ జై' అన్నారని" చెప్పింది.

"ఏనుగమ్మా ఏనుగు! మా వూరొచ్చింది ఏనుగు! పచ్చడి పట్టింది ఏనుగు" అని పాడకపోయావా! చాల్లే పడుకో! ఏదో ఏనుగు బ్రాండ్ పచ్చళ్ళ కంపెనీ ఎడ్వర్‌టైజ్‌మెంట్ అయివుంటుంది!" అన్నాడు ఆనంద్.

"మీ మొహం! ఎడ్వర్టయిజ్‌మెంట్ కాదు! తర్వాత నన్ను స్టేజిమీద కూర్చోపెట్టారు! పురప్రముఖులు చాలా మంది మాట్లాడారు! అందులో ఒకరు త్వరలోనే మన అచ్చమాంబగారికి పద్మశ్రీ బిరుదు వస్తుందనీ తర్వాత మనమంతా ఆవిడ్ని 'పద్మశ్రీ పచ్చళ్ళ అచ్చమాంబ' అని పిలుస్తాం" అన్నారండి.

ఎవడేవాడు! అసలు "నా అచ్చమాంబ"ని, మన అచ్చమాంబ అనడమేమిటి.

"పోన్లెండి ఏదో అభిమానం!"అంది ఆ కల నిజమైనట్లు అచ్చమాంబ.

"అది సరే! నీకు పద్మశ్రీ వచ్చినా, నీ పేరుకి ముందు, ఆ బిరుదు చేర్చినా, ఆ పచ్చళ్ళు కూడా నీ పేరులో వుండవలసినదేనా!" అన్నాడు ఆనంద్.

"అయ్యో! అవేం మాటలండీ! అసలు పద్మశ్రీ బిరుదు యీ పచ్చళ్ళ వలన వచ్చిందే కదా! అటువంటప్పుడు ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసినట్లు ఆ 'పచ్చళు ళ' ఎలా తీసేస్తాం! సర్వ కాల సర్వావస్థలందూ ఆ పచ్చళ్ళు నాతో వుండవలసిందే!" అంది విశ్వాస పాత్రురాలు, అచ్చమాంబ.

"సర్లే నన్ను నిద్రపోనీ! ఆ పచ్చళ్ళు నీతోనే వుండాలంటే, ఓ జాడీ పక్కలో పెట్టుకు పడుకో"

విసిగిపోయిన ఆనంద్ గుంటూరు నుంచి గుల్‌బర్గా బదిలీ చేయించుకుని బ్రతికి పోయాడు.

అచ్చమాంబ యిరుగు పొరుగూ జనం "మీ పచ్చళ్ళు ఇక మాకు ప్రాప్తం లేవు" అని గగ్గోలు పెట్టారు.

"బాధపడకండి! ఏం చేస్తాం! మా వంశంలోని వారంతా పదిమందికీ పచ్చళ్ళు పంచిన వారే. వచ్చే జన్మకైనా నా పచ్చళ్ళ వితరణకి అభ్యంతరం చెప్పే భర్త రాకుంటే, అదే చాలు నాకు!" అని సెలవు తీసుకుని వెళ్ళిపోయింది, పచ్చళ్ళ అచ్చమాంబ.

(ఆంధ్రభూమి, ప్రియదర్శిని, 24-2-2007)